అద్దంలా రహదారులు

- 15వ వార్డులో రూ.45 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



ఉమానగర్‌లో తారు రోడ్డు వేస్తున్న దృశ్యం



జేఆర్‌నగర్ కాలనీలో తారురోడ్డు

మద్దిలపాలెం: గతుకుల రహదారులకు ప్రసుత్తం మోక్షం కలిగింది. చినుకు పడితే చాలు బురదమయంగా మారే మట్టిరోడ్లు తాజాగా అద్దంలా మెరిసిపోతున్నాయి. జీవీఎంసీ 15వ వార్డు ఉమానగర్‌లో జీవీఎంసీ అధికారులు తొలి ప్రాధాన్యంగా మట్టి రోడ్డును రూ.10 లక్షల వ్యయంతో తారు వేసి నిర్మించారు. దీంతో కాలనీకి కొత్త కళ వచ్చింది.

- జేఆర్ నగర్ రోడ్డు అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆదర్శ కాలనీగా పేరొందిన జేఆర్ నగర్‌లో రోడ్డు గోతులమయమై అస్తవ్యస్తంగా మారింది. వర్షం పడితే చెరువును తలపించేలా ఉండేది. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ శ్రీవిద్య ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.10లక్షల వ్యయంతో రోడ్డు ఆధునీకీకరణకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య తీరిందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- ఎంఎంటీసీ జీవన్ విశాఖ రోడ్డును రూ.15 లక్షలతో అభివృద్ధి చేశారు.

సీతమ్మధార హెచ్‌బీ కాలనీ మధ్య ఉన్న ఎంఎంటీసీ జీవన్ విశాఖ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ రోడ్డుకు రూ.15 లక్షల వ్యయంతో ఆధునికీకరించారు. అలాగే యల్లమ్మమాంబ నగర్‌లో రూ.10లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ప్రధాన రహదారులు అభివృద్ధి చెందడంతో వార్డులో ఏ కాలనీని చూసినా కళకళలాడిపోతున్నాయి.

రూ.45 లక్షలతో రోడ్ల అభివృద్ధి



కార్పొరేటర్‌గా ఎన్నికైన తర్వాత వార్డులో ప్రధానంగా సమస్యగా రోడ్లను గుర్తించాం. రోడ్ల మరమ్మతులు, ఆధునికీకరణకు ప్రణాళిక తయారు చేశాం. సుమారు రూ.45 లక్షలతో ముందుగా పాడైన రోడ్లను అభివృద్ధి చేశాం. ఇంకా కొన్ని రోడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వార్డులో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతాం.

– అప్పారి శ్రీవిద్య, 15వ వార్డు కార్పొరేటర్

మట్టి రోడ్డు సమస్య తీరింది..



ఎన్నో ఏళ్లుగా ఉమానగర్ కాలనీకి మట్టి రోడ్డే ఉంది. కార్పొరేటర్ శ్రీవిద్య దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లాం. ఆమె వెంటనే స్పందించారు. తొలి ప్రాధాన్యతగా రూ.10లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మించారు.

– కె.వెంకటరావు, ఉమానగర్

గతుకుల రోడ్డుకు మోక్షం



ప్రధాన రహదారి గోతులతో నిండిపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. రూ.15లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతులు చేయడంతో సమస్య పరిష్కారమైంది. రోడ్డు మరమ్మతులు చేపట్టిన కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు.

– పతివాడ ప్రసాద్, ఎంఎంటీసీ కాలనీ

సీఎం జగన్‌తో మర్యాద పూర్వక భేటీ



తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల, పార్టీ నాయకుడు అక్కరమాని వెంకటరమణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈబీ అధికారులు



మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: మాదక ద్రవ్యాలను విద్యార్థులు దరి చేరనీయొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ జగదీశ్వరరావు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఈబీ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ తెలిసీ తెలియని వయస్సులో మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 14500 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. తొలుత విద్యార్థులు కళాశాల రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అప్పారావు, ఉషా, రాణి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: మాదక ద్రవ్యాల నివారణపై మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ,. జాతీయ సేవా పథకం విభాగం సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ప్రారంభించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు ఉమామహేశ్వరరావు, రత్నభారతి, సుధీర్, సామ్యూల్ డేవిడ్‌రాజ్, రవిబాబు, సిహెచ్.విష్ణుమూర్తి, లక్ష్మణరావు, కుసుమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య సిబ్బందికి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఆస్పత్రి సిబ్బందికి వ్యాక్సిన్ వేస్తున్న సూపరింటెండెంట్ రామిరెడ్డి

ఏయూ క్యాంపస్: వైద్య సిబ్బందికి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వి.రామిరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలో సిబ్బందికి హెపటైటిస్–బి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి సిబ్బంది వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్ వేస్తున్నామని రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎల్.ఆర్.ఎస్.గిరినాథ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సింహాచలం (ఫైల్)

ఎంవీపీ కాలనీ: మద్దిలపాలెం రాజీవ్‌నగర్‌కు చెందిన బగాది సింహాచలం(85) అదృశ్యమైనట్టు ఎంవీపీ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సింహాచలం ఈ నెల 4న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పీవీ చలపతిరావుకు ఘన నివాళి



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: బీజేపీ దివంగత నాయకుడు పీవీ చలపతిరావు జయంతి వేడుకలు లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి చలపతిరావు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘స్పందన’కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

సముద్ర జీవుల మనుగడ ప్రధానం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో యూరోపియన్ కమిషన్ ఆధ్వర్యంలో ‘సూక్ష్మప్లాస్టిక్, విశ్లేషణ, నియంత్రణ, నిర్వహణ విధానాలు’అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. యూనివర్సిటీకి అందించిన పరిశోధన ప్రాజెక్టులో భాగంగా 15 మందికి ఈ అంశంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ సముద్ర జీవుల మనుగడ ఎంతో ప్రధానమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా తీవ్ర నష్టం జరుగుతోందని, దీనిని నియంత్రించే విధానాలపై అధ్యయనాలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం కన్వీనర్‌గా, గౌరవ ఆచార్యులు కె.ఉమాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం ఆచార్య ఇ.ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య సాల్మన్ రాజు, ఆచార్య మురళీకృష్ణ కుమార్, రవి ఈశ్వరపు తదితరులు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. విభాగ అధ్యాపకులు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు.

ఘనంగా కనకదుర్గమ్మ తొలేళ్ల సంబరం



ఇసుకతోటలోని కనకదుర్గ అమ్మవారు

మద్దిలపాలెం : ఇసుకతోట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించారు. మంగళవారం ఉదయం అమ్మవారి వార్షిక జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేడుక సందర్భంగా ఇసుకతోట గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్‌ఎంపీలకు ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షల కోసం విచ్చేసిన ఆర్‌ఎంపీ వైద్యులు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ గ్రామీణ వైద్యులకు ఉచితంగా గుండె పరీక్షలు చేశారు. ఎంవీపీకాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో నేటి నుంచి నెల రోజుల పాటు సంఘంలో రిజిస్టర్ అయిన వారికి ఈ పరీక్షలు చేయనున్నట్లు హాస్పిటల్‌కు చెందిన మహేష్, వైస్ ప్రెసిడెంట్ ఎన్. పద్మజ తెలిపారు. సమారు రూ. 5 వేలు ఖరీదు చేసే ఈ పరీక్షలను పూర్తి ఉచితంగా చేయనున్నట్లు మెడికవర్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ యాజమాన్యానికి సంఘం గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సేవా కార్యకర్త కోన ప్రకాష్, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, జిల్లా సలహాదారు బాలశంకరం, జోనల్ ప్రచార కార్యదర్శి లోగిస గణేష్, వెంకట్రావు, సూర్యకళ, శివప్రసాద్, గాజువాక అధ్యక్షుడు రాజు, నాగేశ్వరరావు, జయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతోనే ఆర్థికాభివృద్ధి

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని, అటువంటి పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల దేశంలో ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 865వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరంలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేడు దేశంలో ప్రజా సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసమే పాలక, ప్రతిపక్ష పార్టీలు కుట్ర రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలిచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి పెట్టుబడి పెట్టి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలన్నారు. ఈ విషయంలో కార్మికవర్గం అప్రమత్తంగా ఉండి తమ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

మదర్స్ లవ్ ఫౌండేషన్ ఔదార్యం



మృతి చెందిన క్యాన్సర్ రోగి కుటుంబానికి సాయం అందిస్తున్న మదర్స్ లవ్ ప్రతినిధి

మద్దిలపాలెం: మృతి చెందిన నిరుపేద క్యాన్సర్ రోగి కుటుంబానికి మద్దిలపాలేనికి చెందిన మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ గంగా ప్రియదర్శిని సుప్రజా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం లక్కవరం గ్రామానికి చెందిన కూండ్రపు పరదేశమ్మ క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ మారికవలసలోని గాయత్రి ఆస్పత్రిలో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని లక్కవరం తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులకు తెలిసింది. వెంటనే ఫౌండేషన్ ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్‌ను మదర్స్ లవ్ ప్రతినిధి ఉదయ్ సమకూర్చారు. అంత్యక్రియల ఖర్చుల కోసం ఫౌండేషన్ ప్రతినిధి ఏఎస్ స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ మణిదీప్ సహాయం చేశారు. అలాగే లక్కవరంలో పరదేశమ్మ అంత్యక్రియలు దగ్గరుండి నిర్వహించి తమ మానవత్వం చాటుకున్నారు.

జ్ఞానానంద ఆశ్రమంపై జ్యుడీషియల్ విచారణ జరపాలి



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

మహారాణిపేట : జ్ఞానానంద ఆశ్రమంపై వచ్చిన ఆరోపణలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపి, స్పందనలో వినతిపత్రం అందించారు. పేదలు, అనాథ పిల్లలను చేర్చుకుని పూర్ణానంద సరస్వతి ఆశ్రమం నిర్వహిస్తున్నారని పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి ఆరోపించారు. పిల్లలపై దాడులు చేస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ గతంలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. 12 సంవత్సరాల బాలిక నిర్బంధం, లైంగిక దాడి, శారీరక హింస, వెట్టిచాకిరీపై ఇప్పుడు కూడా కేసు నమోదు చేశారని లక్ష్మి అన్నారు. జ్ఞానానంద ఆశ్రమం ఎదుట ఇటీవల ఆందోళన చేసిన మహిళా ఉద్యమకారులపై చేయి చేసుకున్న ఎస్ఐ దివ్యజ్యోతిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, కార్యదర్శి వై. సత్యవతి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎంఏ బేగం, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు పీఎస్ పద్మావతి పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలపై వర్క్‌షాప్

సీతంపేట: బోధనా నైపుణ్యాలు, ఫలితాల ఆధారిత విద్యాభ్యాసం, పరిశోధన అంశాల్లో నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాలేజీలో నిర్వహిస్తున్న ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. పలు కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, రిసోర్స్ పర్సన్లుగా బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి వ్యవహరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అధ్యాపకులను అభినందించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కన్వీనర్ జె.బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బస్సులో మేయర్.. సైకిల్‌పై కమిషనర్



బస్సు నుంచి దిగి జీవీఎంసీ కార్యాలయానికి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి



సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకుంటున్న కమిషనర్

- కాలుష్య నియంత్రణలో చిత్తశుద్ధి
- ప్రజా వాహనాల్లో ప్రయాణం

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రతి సోమవారం వాహనాలు వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తూ పలువురు ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మేయర్ ఆరిలోవ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకున్నారు. కమిషనర్ బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ విశేష కృషి చేస్తుందని, మొక్కల సంరక్షణ, కార్యాలయంలోకి ఉద్యోగుల వాహనాలు అనుమతించకపోవడం వంటి చర్యలు తీసుకున్నామన్నారు.

అసంపూర్తిగా పార్కు నిర్మాణం



విశాలాక్షినగర్‌లో పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో పార్కు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కో–ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో సీతకొండ దిగువన సుమారు 1.5 ఎకరాల స్థలంలో జీవీఎంసీ పార్కు నిర్మాణం చేపట్టింది. ఇందు కోసం ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. కొద్ది రోజులు పాటు స్థలం చుట్టూ చకచకా గోడల నిర్మాణం చేపట్టారు. అనంతరం మిగతా పనులు చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ స్థలం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. చుట్టూ గోడలు ఉండడంతో లోపల పార్కు సిద్ధమైపోయిందేమోనని స్థానికులు అక్కడకు వెళ్లేసరికి అంతా పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. ఇందులో పిల్లలు ఆడుకోవడానికి వివిధ ఆట పరికరాలు, వృద్ధులు సేదదీరడానికి బెంచీలు, నడక కోసం వెళ్లేవారికి పాత్‌వేలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి పార్కు నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ముగిసిన ఈకార్వో సమ్మర్ క్యాంప్



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైల్ క్లబ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి.. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన, పాల్గొన్న వారిందరికీ ఈకార్వో సభ్యుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. రైల్వే ఉద్యోగుల పిల్లలు, బయటి వారి పిల్లలకు కీబోర్డు, శాస్త్రీయ సంగీతం, చెస్, డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, కరాటే, ఇంగ్లిష్ పరిజ్ఞానం వంటి అంశాల్లో శిక్షణ నిచ్చారు. సుమారు 600 మంది చిన్నారులు పాల్గొన్నట్లు ఈకార్వో ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్లు కవితా గుప్తా, మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల డిగ్రీతో ఎంతో ప్రయోజనం

డాబాగార్డెన్స్: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, విదేశాల్లో ఉన్న అవకాశాల నేపథ్యంలో నాలుగేళ్ల పాటు చదువుకునే డిగ్రీకి ఎన్నో ప్రయోజనాలున్నాయని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు తెలిపారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సులపై సోమవారం కళాశాల ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు సింగిల్ సబ్జెక్ట్ జాయిన్ అయిన విద్యార్థులున్నారని, వారందరికీ విదేశాల్లో ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. డీన్ శంకరనారాయణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కృష్ణకుమారి, ఎగ్జామినేషన్ కన్వీనర్ సీహెచ్ మల్లిక, హిందీ ఫ్యాకల్టీ జీవీఎస్‌వీఎల్ శ్రీనివాసమూర్తితో పాటు కళాశాలలోని 17 విభాగాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.